

అద్దంకి పట్టణంలోని పాత శివాలయంలో అలంకరణలో స్వామివారు



స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న అద్దంకి మున్సిపల్ చైర్‌పర్సన్



సంతమాగులూరు : దాతలు పెట్టిన ప్రసాదాన్ని ఆరగిస్తున్న భక్తులు

సర్వం శివోహం

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు
- దేవాలయాల్లో భక్తుల కోలాహలం

శివరాత్రి పర్వదినం సందర్భంగా అద్దంకి, చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు.. హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివనామస్మరణతో మార్మోగాయి. బుధవారం వేకువ జామునుంచే భక్తులు శివాలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

అద్దంకి రూరల్:

పట్టణంలోని పాత శివాలయం, వేయిస్తంభాల దేవస్థానాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎల్. ఎస్తేరమ్మ, కౌన్సిలర్‌లు గ్రామోత్సవం వెళ్లి పాత శివాలయంలోని శివపార్వతులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం దేవాలయంలో శివపార్వతుల కళ్యాణం జరిపించారు.

మణికేశ్వరంలో..

చిన్న కాశీగా పేరు పొందిన మండలంలోని మణికేశ్వరం దేవస్థానంలో బుధవారం శివరాత్రి పురస్కరించుకుని మల్లేశ్వరస్వామిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి దర్శించుకున్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. రాత్రికి స్వామివారి లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

అద్దంకి: సంతమాగులూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ తిరునాళ్లకు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. దానిలో భాగంగా అడ్డరోడ్డులో దాతలు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కోటప్పకొండకు వెళ్లే భక్తులకు పులిహోర, దద్దోజనం, గుగ్గిళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ గురూయాదవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అద్దంకి: మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా బుధవారం దక్షిణ కాశిగ పేరుగాంచిన మణికేశ్వరంలోని మల్లీశ్వర స్వామి దేవస్థానంలో రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వేటపాలెం: శివాలయాల ప్రాంగణాలు హరహర శంభో శంకర అంటూ భక్తుల శివనామ స్మరణతో మారుమోగాయి. ఉదయాన్నే భక్తులు శివాల యాలకు వెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. రోజంతా ఉపవాసం ఉండి సాయం కాలం శివాలయాలకు వెళ్లి దీపారాధన చేసి పూజలు నిర్వహించారు.

యద్దనపూడి: శివ పంచాక్షరి జపంతో భక్తులు పరవశించిపోయారు. అభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజతో శివాలయాలన్ని అడుగడుగునా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. పూనూరులోని త్రిపురసుందరి సమేత త్రిపురాతంకస్వామి, యద్దనపూడి రామలింగేశ్వరస్వామి, అనంతవరం బోగమల్లేశ్వరస్వామి , గన్నవరం కాశీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గన్నవరం- మార్టూరు దండు దారి వద్ద వేంచేసి ఉన్న గోవిందమాంబ సమేత శ్రీమద్ వీరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.



తిమిడెదపాడు మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



మణికేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో మల్లేశ్వరస్వామి

కారంచేడు: శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరిపించారు. పెద్ద బజారులో కొలువైన గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు కారంచేటి వీరాంజనేయ శర్మ పూజలు నిర్వహించారు. గ్రామంలోని హరేరామ ఆశ్రమంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. తిమిడెదపాడు గ్రామంలోని మల్లేశ్వరస్వామివారి ఆలయంలోని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

చీరాల అర్బన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం చీరాల పట్టణ, పరిసర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలు శివనామ స్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శైవ క్షేత్రాలకు వచ్చి శివయ్య దర్శనం కోసం బారులుతీరారు. పట్టణంలోని చీరాల, పేరాల, ఈపురుపాలెం, జాండ్రపేట, తోటవారిపాలెం, కొత్తపేటలోని పలు శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీలకంఠునికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. పేరాలలోని పునుగు రామలింగేశ్వరస్వామి దేవాలయం భక్తులతో నిండిపోయింది. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. బుధవారం అర్ధరాత్రి నిర్వహించే లింగోద్భవ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ చైర్మన్, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లును పర్యవేక్షించారు. అలానే చీరాల ఆర్టీసీ డిపో నుంచి శైవ క్షేత్రాలు అయిన కోటప్పకొండకు 45 బస్సులు, శ్రీశైలం, సోపిరాల ప్రాంతాలకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచి గురువారం ఉదయం వరకు స్పెషల్ బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల తెలిపారు. భక్తుల శివనామ స్మరణతో దేవాలయాలు శోభాయమానంగా ఉన్నాయి.

బల్లికురవ: హరహరమహదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణతో మండలంలోని శివాలయాలు బుధవారం తెల్లజామున 5 గంటల నుంచే మార్మోగాయి. చెన్నుపల్లి, కొండాయపాలెం, నక్కబొక్కలపాడు, కొణిదెన, గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు, ముక్తేశ్వరం, వేమవరం, గ్రామాల్లోని శివాలయాల్లో శివునికి అభిషేకాలు, అర్చనలు ప్రత్యేక అలంకరణ, శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించారు. రాత్రికి లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యల్లో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కొండాయపాలెం గ్రామంలోని గంగాపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద హిమాలయ నాగ సాధువుల బృందంచే రాత్రి 6.30 గంటలనుంచి 7.30 గంటల వరకు సుమారు 7అడుగుల మట్టి శివలింగానికి గంటపాటు అభిషేకం చేశారు. స్వామి జ్ఞాన ప్రసన్న గిరిచే ఢమరక, ఘంటా శంఖారావంతో హరహరమహదేవ శంభోశంకర అంటూ శివ నామ స్మరణతో కైలాస వాతావరణంలో రుద్రాభిషేకం, భస్మాభిషేకం, హారతులు, నివేదనలు చేపట్టారు. రుద్రాభిషేకంలో బల్లికురవతోపాటు పరిసర మండలాలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పులిహోర పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు



కారంచేడు హరేరామ ఆశ్రమంలో స్వామివారి అలంకరణ



పేరాల శివాలయంలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వర స్వామి



యద్దనపూడి: ప్రత్యేక అలంకరణలో పూనూరులోని త్రిపురాంతక స్వామి

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

మేదరమెట్ల: శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని శైవక్షేత్రాల్లో శివనామస్మరణలు బుధవారం మార్మోగాయి. మండలంలోని మేదరమెట్ల పార్వతి సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు తెల్లవారిజాము నుంచే స్వామి వారిని దర్శించుకొని స్వామికి అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్త సమాజం ఆధ్వర్యంలో తెల్లవారిజాము నుంచి రాత్రి వరకు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.



మేదరమెట్ల శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



మేదరమెట్ల: తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్త సమాజ సభ్యులు



కొణిదెనలో నాగలింగేశ్వరుడు, శివపార్వతుల కల్యాణం



కొండాయిపాలెంలో నాగసాధువుల బృందంచే మట్టి శివలింగానికి రుద్రాభిషేకం



రామకోటేశ్వరాలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



రామకోటేశ్వరాలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

చినగంజాంలో వైభవంగా..

- రామకోటేశ్వరాలయం, బాలకోటేశ్వరాలయం వద్ద భారీ ఏర్పాట్లు
- రెండు దేవాలయాల వద్ద శివుని దర్శించుకున్న వేలాది మంది భక్తులు
- ఆలయాల వద్ద భారీగా విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు

చినగంజాం: మహా శివరాత్రి తిరునాళ్లను చినగంజాంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ రామకోటేశ్వరాలయం, శ్రీ బాల కోటేశ్వరాలయంలో ఆలయ కమిటీలు భారీగా ఏర్పాట్లు చేశారు. బుధవారం వేకువ జాము నుంచే స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు దేవాలయాల వద్ద నిర్వాహకులు చిన్నపాటి శివలింగాలను ఏర్పాటు చేసి భక్తులచే అభిషేకాలు చేయించారు. రామకోటేశ్వరాలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ టీఎస్సార్ ఆంజనేయులు ఆధ్వర్యంలో శ్రీ బాలకోటేశ్వరాలయం వద్ద ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పండగ సందర్భంగా వేలాది భక్తులు శివుని దర్శించుకున్నారు. ఆలయాల వద్ద తిరునాళ్ల సందర్భంగా భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభల వద్ద నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా మండలంలోని సంతరావూరు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు వందల సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



బాలకోటేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఆటో డ్రైవర్‌కు గాయాలు

పర్చూరు(చినగంజాం): చిన్ననందిపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ జూపూడి సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పర్చూరులో కూలీలను వదలిపెట్టి పెదనందిపాడు వెళుతున్న ఆటోని ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన సునీల్‌ను ప్రథమ చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

సువార్త వ్యాప్తి చేయడమే లక్ష్యం



వాక్య సందేశం అందిస్తున్న గిడియన్స్ ఇంటర్నేషనల్ ఫీల్డ్ ఆఫీసర్ ఆనంద్ జోసఫ్

చీరాల రూరల్: దేవుని జీవ వాక్యమైన సువార్తను నలుదిశలా వ్యాప్తి చేయడమే గిడియన్స్ ఇంటర్నేషనల్ ముఖ్య ఉద్దేశమని గిడియన్స్ ఇంటర్నేషనల్ ఫీల్డ్ ఆఫీసర్ బ్రదర్ ఆనంద్ జోసఫ్ అన్నారు. బుధవారం కొత్తపేటలోని ఇమ్మానియేల్ లూథరన్ చర్చి కమ్యూనిటీ హాలులో గిడియన్స్ ఇంటర్నేషనల్ చీరాల క్యాంప్ ఆధ్వర్యంలో పాస్టర్స్ అప్రిసియేషన్ బాంక్విట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రదర్ ఆనంద్ జోసఫ్ మాట్లాడారు. గిడియన్స్ ఇంటర్నేషనల్ మొట్ట మొదటిసారిగా అమెరికా దేశంలో 1909లో ముగ్గురు ఏర్పాటు చేశారని, ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 199 దేశాల్లో 109 అధికార భాషల్లో బైబిల్ గ్రంథం విస్తరించిందని చెప్పారు. అందుకుగాను పాస్టర్లు ప్రార్థనా పూర్వకంగా ఆర్థికంగా ఎంతగానో సహకరిస్తున్నారని చెప్పారు. యండ్రపాటి జాన్సన్, యాజల ప్రకాష్, యామర్తి ప్రకాష్, డానియేల్ ఐజాక్సన్, విజయ కుమార్, కేపీ దాసు, కట్టా నవీన్, వై. రజనిజాన్సన్, వై. కమలాప్రకాష్, కేతు మనోరంజని పాల్గొన్నారు.

బాలకోటేశ్వర స్వామిని దర్శించుకున్న గాదె

చినగంజాం: మండలంలోని బాలకోటేశ్వర స్వామి ఆలయం పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి బుధవారం రాత్రి సందర్శించారు. శివరాత్రి తిరునాళ్ల సందర్భంగా ఆయన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, ఆసోది బ్రహ్మానందరెడ్డి, ఉప్పలపాటి అనిల్, ఆసోది గోపాలరెడ్డి, బేతాళ మునిరత్నం, అక్కల రామకృష్ణారెడ్డి, రాజు పోలిరెడ్డి, అమరా శ్రీను, కోట సుబ్బరామిరెడ్డి, ఇసూబ్, సుభాని, షేక్ జాని, కరిముల్లా, పెల్లేటి అచ్యుత్ రెడ్డి, షాకీర్, సుబ్బారెడ్డి, మర్రి స్వామిరెడ్డి, బొడ్డు కృష్ణారెడ్డి, బక్కా రమణారెడ్డి, బక్కా వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న అంకమ్మ తల్లి అమ్మవారు



జలబిందెలతో భారీగా గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెంలో కొలువై ఉన్న శ్రీ అంకమ్మ తల్లి వార్షికోత్సవాలు బుధవారంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వార్షికోత్సవాల్లో భాగంగా మొదటిరోజు అమ్మవారి గ్రామ పర్యటన, జల బిందెలు, పసుపు కుంకుమ ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జలబిందెల ఊరేగింపు, గ్రామోత్సవానికి భక్తులు హాజరయ్యారు. దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక ఆకర్షణగా ఎల్ఈడీ బల్బులతో అమ్మవారి ప్రభను ఏర్పాటు చేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం ధనిష్ఠ నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

బల్లికురవలో ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందిగా నిర్వహిస్తున్నట్లు పరీక్షల చీఫ్ పి. రవీంద్ర బాబు బుధవారం తెలిపారు. బల్లికురవ కళాశాల, కేజీబీవీ వలపర్ల మాగుంట సుబ్బరామిరెడ్డి కళాశాల అక్కడి ఉన్నత పాఠశాలలలోని ఫ్లస్‌టు నుంచి మొదటి సంవత్సరం 126 మంది, రెండో సంవత్సరం 126 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. వీరంతా ఆయా కళాశాలల నుంచి హాల్ టికెట్లు పొందాలని లేదా డౌన్‌లోడ్ చేసుకోవాలని పరీక్షలకు సంబంధించి 5 నుంచి 6 రూంలు కేటాయిస్తూ జంబ్లింగ్ విధానం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకల్లా విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సెల్ ఫోన్‌లు, అనుతించరని పరీక్షలు ప్రశాంతంగా ముగిసేందుకు విద్యార్థులు, తల్లి దండ్రులు, కళాశాల అధ్యాపకులు సహకరించాలని చీఫ్ కోరారు.

పేకాట శిబిరంపై.. దాడి ఐదుగురు అరెస్ట్

పర్చూరు(చినగంజాం): నూతలపాడు శివారులోని పేకాట శిబిరంపై బుధవారం పర్చూరు పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 14,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ.. కేసు నమోదు

పర్చూరు(చినగంజాం): మండలంలోని దేవరపల్లి గ్రామంలో ద్విచక్రవాహనం చోరీకి గురైంది. మంగళవారం రాత్రి ఇంటి బయట పెట్టిన తన యాక్టివా ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళినట్లు గ్రామానికి చెందిన నాదెండ్ల వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్ల పోటీలను నిర్వహించడం వల్ల స్నేహ బంధాలు మెరుగుపడుతాయని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని బోయినవారిపాలెం గ్రామంలో పోలురాధా ఎడ్ల పందేలను నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన పశుపోషకుల ఈలలు, కేరింతలతో గ్రామంలో సందడి నెలకొంది. సత్తా చాటిన ఎడ్ల యాజమానులకు బహుమతులు అందించారు.